ప్రైవేట్‌కు బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్

సొంతంగా ఏర్పాటు చేసేందుకు ముందుకురాని జెన్‌కో

కేంద్ర సాయంతోపాటు 70 ఎకరాల జెన్‌కో స్థలాన్ని అస్మదీయులకు అప్పగించేందుకు సర్కారు కుట్ర

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో ఏర్పాటు చేయాల్సిన అతిపెద్ద బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌పై జెన్‌కో చేతులెత్తేసింది. (బిల్డ్-ఆపరేట్-ఓన్) పద్ధతిలో ఆ ప్లాంట్‌ను సొంతంగా ఏర్పాటు చేయాల్సిన జెన్‌కో పూర్తిగా అస్త్రసన్యాసం చేసింది. ఆ ప్లాంట్‌ను బడాబాబులకు అప్పగించించేందుకు టెండర్లను ఆహ్వానించింది. గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ ప్లాంట్ ఏర్పాటుకయ్యే రూ.600 కోట్ల అంచనా వ్యయంలో 40% మొత్తాన్ని (రూ.240 కోట్లు) వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద అందజేస్తుంది. మిగిలిన 60% మొత్తాన్ని (రూ.360 కోట్లు) జెన్‌కో పెట్టుబడిగా పెడితే సరిపోతుంది. అయినప్పటికీ కేంద్ర సాయాన్ని అందిపుచ్చుకోకుండా ఆ ప్లాంట్‌ను ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు జెన్‌కో రంగం సిద్ధం చేసింది. దీంతో కేంద్రం అందించే రూ.240 కోట్లు ప్రైవేట్ వ్యక్తులకు దక్కనున్నాయి.



విద్యుత్తు జెన్‌కోదే.. అమ్మేదీ జెన్‌కోకే

విచిత్రమేమిటంటే ఈ ప్లాంట్‌లో నిల్వచేసే విద్యుత్తు జెన్‌కోదే. డిమాండ్ లేనప్పుడు జెన్‌కో నుంచి తక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలుచేసి ఈ ప్లాంట్‌లోని బ్యాటరీల్లో నిల్వచేస్తారు. డిమాండ్ పెరిగినప్పుడు ఆ విద్యుత్తును మళ్లీ జెన్‌కోకే విక్రయిస్తారు. ఈ ప్లాంట్ జీవిత కాలాన్ని 25 ఏండ్లుగా నిర్ణయించారు. అంటే.. ఈ ప్లాంట్‌ను ఏర్పాటుచేసే ప్రైవేట్ సంస్థ 25 ఏండ్లపాటు జెన్‌కో నుంచి విద్యుత్తు కొనుగోలు చేసి, బ్యాటరీల్లో నిల్వ చేస్తుంది. ఆ విద్యుత్తునే మళ్లీ జెన్‌కోకు విక్రయించి సొమ్ము చేసుకుంటుంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన జెన్‌కో వార్షిక టర్నోవర్ రూ.15 వేలకోట్ల పైమాటే. అలాంటి సంస్థ బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కేవలం రూ.360 కోట్లు పెట్టుబడిగా పెట్టలేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై జెన్‌కోతోపాటు ప్రభుత్వం పునరాలోచించాలని విద్యుత్తు రంగ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

అస్మదీయుల కోసమేనా?

బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటును ప్రైవేట్ సంస్థకు అప్పగించేందుకు టెండర్లు పిలవడం వెనుక భారీ కుంభకోణం ఉన్నదని, వీజీఎఫ్‌గా సమకూరే రూ.240 కోట్లతోపాటు జెన్‌కోకు చెందిన 70 ఎకరాల స్థలాన్ని అస్మదీయులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు కుట్ర చేశారని, అందుకే ఉద్దేశపూర్వకంగా జెన్‌ను తప్పించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. శంకర్‌పల్లిలో గ్యాస్ ఆధారిత విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు కోసం గతంలో స్థల సేకరణ జరిపారు. కానీ, ఆ ప్లాంట్ ఏర్పాటులో ముందడుగు పడలేదు. జెన్‌కో నిర్లక్ష్యం వల్ల ఆ స్థలంలో ఇప్పటికే కొంత భాగం కబ్జాకు గురైంది. మిగిలిన స్థలంలో బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అదికూడా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీన్ని జెన్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌ను సొంతంగా జెన్‌కో నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

airtel

ఐదింతలైన

ఎయిర్‌టెల్ లాభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.16,134.6 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,876.4 కోట్ల లాభంతో పోలిస్తే ఐదు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.45, 129.30 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది.

ఎన్ఎండీసీ ఆకర్షణీయం

హైదరాబాద్, ఫిబ్రవరి 6: ఎన్ఎండీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికిగాను సంస్థ రూ.1,897 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.1,492.73 కోట్ల లాభంతో పోలిస్తే 29 శాతం ఎగబాకింది. కంపెనీ ఆదాయం 21 శాతం ఎగబాకి రూ.6,942.92 కోట్లకు చేరుకున్నది.

ఎస్బీఐ లాభం 16,891 కోట్లు

క్యూ3లో 84 శాతం పెరిగిన ప్రాఫిట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అదరగొట్టింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.16,891 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.9,164 కోట్ల లాభంతో పోలిస్తే 84 శాతం వృద్ధిని సాధించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.1,28,467 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది సమకూరిన రూ.1,18,193 కోట్లతో పోలిస్తే ఇది 8.69 శాతం అధికం. దీంట్లో వడ్డీల రూపంలో రూ.1,17,427 కోట్లు సమకూరినట్లు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది.

- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.42 శాతం నుంచి 2.07 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ విలువ 0.64 శాతం నుంచి 0.53 శాతానికి దిగొచ్చింది.
- ఎస్బీఐ గ్రూపు కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 70 శాతం ఎగబాకి రూ.18,853 కోట్లకు చేరుకున్నది. క్రితం ఏడాది ఇది రూ.11,064 కోట్లుగా ఉన్నది. అలాగే ఆదాయం రూ.1,53,072 కోట్ల నుంచి రూ.1,67,854 కోట్లకు ఎగబాకింది.
- బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 4 శాతం అధికమై 41,446 కోట్లుగా నమోదైంది.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.911 కోట్ల నిధులను వెచ్చించింది.

నష్టాల్లో మార్కెట్లు

ముంబై, ఫిబ్రవరి 6: దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలపరంపర కొనసాగుతున్నది. రిజర్వుబ్యాంక్ పరపతి సమీక్షకంటే ముందు మదుపరులు అప్రమత్తతకు మొగ్గుచూపడంతోపాటు ఎఫ్ఐఐలు భారీగా నిధులను తరలించుకుపోవడంతో వరుసగా రెండోరోజూ సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 213.12 పాయింట్లు కోల్పోయి 78,058.16 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 92.95 పాయింట్లు కోల్పోయి 23,603.35 వద్ద ముగిసింది. భారతీ ఎయిర్‌టెల్ షేరు 2.47 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు టైటాన్, ఎన్టీపీసీ, ఎస్బీఐ, ఐటీసీ, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్‌లు అత్యధికంగా నష్టపోయాయి.



అరబిందో లాభంలో క్షీణత

హైదరాబాద్, ఫిబ్రవరి 6: అరబిందో ఫార్మా నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.846 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని మాత్రమే గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.940 కోట్లతో పోలిస్తే 10 శాతం తగ్గినట్లు పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.7,352 కోట్లుగా ఉన్న కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.7,979 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది.

కొత్త బాస్.. కోతకు సై!

నేడే ఆర్బీఐ ద్రవ్యసమీక్ష నిర్ణయం

నూతన గవర్నర్ వడ్డీరేట్లను తగ్గిస్తారన్న అంచనాలు

రెపో రేటు పావు శాతం దిగివచ్చే అవకాశం



ముంబై, ఫిబ్రవరి 6: ఆర్బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో జరుగుతున్న తొలి ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేట్లు తగ్గుతాయనే అంచనాలే ఎక్కువగా వస్తున్నాయి. శుక్రవారం ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఆర్బీఐ ప్రకటించనున్నది. అయితే ఇటీవలి బడ్జెట్ నేపథ్యంలో ఈ ద్రవ్యసమీక్షపై అటు వ్యాపార-పారిశ్రామిక రంగాలు, ఇటు బ్యాంకర్లు-రుణగ్రహీతలు భారీగానే ఆశలు పెట్టుకున్నారు. దీనికి తగ్గట్టుగానే రెపో రేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) కోత పెట్టవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయిప్పుడు. నిజానికి గత ద్రవ్యసమీక్షలో అప్పటి గవర్నర్ శక్తికాంత దాస్.. మున్ముందు పాలసీ రివ్యూల్లో వడ్డీరేట్లు తగ్గవచ్చన్న సంకేతాలనిచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ సమీక్ష మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.

ఐదేండ్ల తర్వాత..

గత రెండేండ్లుగా వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ ద్రవ్యసమీక్షలు ముగుస్తున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా రెపో రేటును 6.50 శాతానికి పెంచారు. అప్పట్నుంచి ఇది అక్కడే ఉంటున్నది. ఇక రెపో రేటును ఆఖరిసారిగా తగ్గించింది 2020 మే నెలలోనే. కరోనా దెబ్బకు దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థలో నూతనోత్సాహాన్ని నింపేందుకు నాటి గవర్నర్ దాస్ ప్రత్యేకంగా ఆర్బీఐ సమీక్ష నిర్వహించి రెపో రేటును తగ్గించారు. రుణ లభ్యత పెరిగేలా 4 శాతానికి దించారు. కానీ ద్రవ్యోల్బణం విజృంభించడంతో తదుపరి ద్రవ్యసమీక్షల్లో దాన్ని అదుపు చేసేందుకు మళ్లీ వడ్డీరేట్లను వరుసగా పెంచుతూపోయారు. ఈ క్రమంలో ఈసారి ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్లు తగ్గితే ఐదేండ్ల తర్వాత ఇప్పుడే తగ్గినట్టు కానున్నది.

ఆటో, రియల్టీకి ఉత్సాహం?

గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై చాలాకాలం నుంచి అధిక వడ్డీరేట్లనే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు అనుసరిస్తున్నాయి. ఫలితంగా ఆయా రుణగ్రహీతలు, వివిధ వ్యాపార రంగాలు ప్రభావితమవుతున్నాయి. కానీ ఈసారి ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గిస్తే రియల్టీ, ఆటోతోపాటు పలు రంగాల్లో తిరిగి అమ్మకాలు పుంజుకుంటాయంటున్నారు. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. సుంకాలను పెంచుతూ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తున్న నేపథ్యంలో వడ్డీరేట్ల తగ్గింపు తొందరపాటే అవుతుందంటున్నవారూ లేకపోలేదు. ముఖ్యంగా వడ్డీరేట్లు తగ్గితే రూపాయిపై మరింత ఒత్తిడి పెరుగుతుందని వారు విశ్లేషిస్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠాల్లో కదలాడుతున్న సంగతి విదితమే. కానీ దేశంలో వినిమయ శక్తిని పెంపొందించడానికి బడ్జెట్‌లో తన వంతుగా కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత ఆదాయ పన్ను ఊరటను కల్పించింది. ఈ క్రమంలో ఆర్బీఐ వంతుగా వడ్డీరేట్లను తగ్గించవచ్చన్న అంచనాలే ఎక్కువగా ఉన్నాయి.

జొమాటో

ఇకపై ఎటర్నల్

పేరు మార్పునకు లైన్‌క్లియర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఆన్‌లైన్ ఫుడ్, గ్రాసరీ డెలివరీ దిగ్గజం జొమాటో.. పేరు మార్చుకుంటున్నది. ఎటర్నల్‌గా మారిపోతున్నది. ఇందుకు గురువారం జొమాటో సంస్థ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే కంపెనీ వాటాదారులు, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సంబంధిత అధికార వర్గాలు ఆమోదించాల్సి ఉన్నది. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో జొమాటో పేర్కొన్నది. కాగా, ఫుడ్ డెలివరీ బిజినెస్ బ్రాండ్ జొమాటో యాప్ పేరు మాత్రం అదే. 'పేరు మార్పునకు మా బోర్డు అంగీకరించింది. షేర్‌హోల్డర్స్ కూడా మద్దతివ్వాలని కోరుతున్నాను. కావాల్సిన అనుమతులన్నీ వచ్చాక మా కార్పొరేట్ వెబ్‌సైట్ పేరు జొమాటో.కామ్ నుంచి ఎటర్నల్.కామ్‌గా మారిపోతుంది. మా స్టాక్ టిక్కర్‌నూ మారుస్తాం' అని జొమాటో వ్యవస్థాపక సీఈవో దీపిందర్ తెలిపారు. ఎటర్నల్‌లో జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, హైపర్‌ప్యూర్ అనే 4 వ్యాపార విభాగాలుండనున్నాయి.

టీసీఎస్ ఉద్యోగులకు షాక్

సీనియర్ ఉద్యోగుల వేరియబుల్ చెల్లింపుల్లో కోత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ సీనియర్ ఉద్యోగులకు షాకిచ్చింది. డిసెంబర్ త్రైమాసికంలో సీనియర్ ఉద్యోగుల వేరియబుల్ చెల్లింపుల్లో 20 శాతం నుంచి 40 శాతం వరకు కోత విధించింది. ఉద్యోగి పనితీరు ఆధారంగా ఈ వేరియబుల్ చెల్లింపులు జరుపుతుంటుంది సంస్థ. వరుసగా రెండు త్రైమాసికాలుగా సిబ్బంది మెరుగైన పనితీరు కనబరిచినిప్పటికీ వేరియబుల్ చెల్లింపుల్లో కోత విధించడం విశేషం. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి 100 శాతం వేరియబుల్ చెల్లింపులు జరిపినట్లు కంపెనీ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. కానీ, కొత్త పెట్టిన వారిలో సీనియర్ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. ఉద్యోగులకు కార్యాలయాలకు రప్పించడంలో భాగంగా టీసీఎస్ వేరియబుల్ పే నిబంధనల్లో గతేడాది మార్పులు చేసిన విషయం తెలిసిందే. వేరియబుల్ పేను ఆఫీస్ హాజరు తో ముడిపెట్టింది. ఎవరైతే 60 శాతం కంటే తక్కువ ఆఫీస్‌కు హాజరవుతారో వారికి ఎలాంటి చెల్లింపులు ఉండవని స్పష్టంచేసింది. 60-75 శాతం ఉన్నవారికి 50 శాతం, 75-85 శాతం ఉన్నవారికి 75 శాతం, 85 శాతం కంటే ఎక్కువ హాజరుంటేనే వేరియబుల్ అందుకునేందుకు అర్హులుగా పేర్కొంది.

₹8 కోట్లతో బులియన్ వ్యాపారి పరార్

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 6 : నాలుగు దశాబ్దాలుగా ప్రజలతో నమ్మకంగా ఉండి.. దాదాపు ₹8 కోట్లతో బులియన్ వ్యాపారి పరారైన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖనిలోని ప్రముఖ వాణిజ్య కేంద్రమైన లక్ష్మీనగర్‌లో నాలుగు దశాబ్దాలుగా బులియన్ (బంగారం) వ్యాపారం చేస్తున్న ఓ వ్యాపారికి సింగరేణి కార్మికులు, రిటైర్డు కార్మికులు పెద్ద ఎత్తున వడ్డీకి రుణంగా డబ్బులు ఇచ్చారు. అలాగే, పెళ్లిళ్ల పేరిట బంగారు ఆభరణాలను ఆర్డర్ చేయగా సదరు వ్యాపారి ఎవరికీ చెప్పకుండా బంగారం, నగదుతో కనబడకుండా పరారయ్యాడు. అయితే, కొంతమందికి అప్పటికి అప్పు బాకీగా పత్రాలు రాసి ఇచ్చాడు. గత కొంత కాలంగా సదరు వ్యాపారి తన దుకాణాన్ని మూసివేయడంతో 50 మందికి పైగా బాధితులు గురువారం బులియన్ దుకాణానికి వచ్చి షాపు ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఫిర్యాదుదారుల నుంచి వివరాల సేకరించి బులియన్ వ్యాపారి ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు.

రైల్వే మంత్రిత్వ శాఖ

(దక్షిణ మధ్య రైల్వే)

PUB NO.0127

ప్రకటన

సికింద్రాబాద్, 31 జనవరి, 2025

S.O.583(E)- రైల్వేల చట్టం 1989లోని సెక్షన్ 2 యొక్క క్లాజ్ (7A) ద్వారా సంక్రమించిన అధికారాల్ని వినియోగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం అధికారిక రాజపత్రంలో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి వర్తింపుతో సదరు టేబుల్‌లో కాలమ్ (3)లో తెలిపిన రాష్ట్రంలో అమలు, నిర్వహణ, మేనేజ్‌మెంట్ మరియు ఆపరేషన్ కొరకు, టేబుల్ యొక్క కాలమ్ (2)లో తెలిపిన విధంగా స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్‌కు సంబంధించి సమర్థ ప్రాధికారి విధులను నిర్వర్తించేందుకు దిగువ టేబుల్‌లో కాలమ్ (5)లో తెలిపిన అధికారికి ఇందుమూలంగా అధికారం ఇచ్చినది.

టేబుల్

క్ర. సం.	స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్	రాష్ట్రం	జిల్లా	సమర్థ ప్రాధికారి
(1)	(2)	(3)	(4)	(5)
1.	పెద్దపల్లి-రాఘవపురం స్టేషన్ మధ్య కి.మీ. 285/24-26 వద్ద లెవల్ క్రాసింగ్ నెం.44 స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం.	తెలంగాణ	పెద్దపల్లి	రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్, పెద్దపల్లి

[File No. : DYCE/CON/RSP/ROB/LAND AQ/2024/13]

మనోజ్ కుమార్, చీఫ్ ఇంజినీర్/C/RSP S.C.Rly, సికింద్రాబాద్

A0162

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

No.C/C/YTSK/2025 తేది: 06.02.2025

దరఖాస్తులు కోరుతూ ప్రకటన

PUB/0131

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్, సికింద్రాబాద్ వారు రిజర్వుడ్ మరియు అన్‌రిజర్వుడ్ టికెట్లు జారీ చేయుట కొరకు అనుబంధం-1లో తెలిపిన విధంగా వివిధ ప్రదేశాల వద్ద ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా **యాత్రి టికెట్ సువిధ కేంద్ర** (YTSK) స్థాపన మరియు ఆపరేషన్స్ కొరకు దరఖాస్తులు కోరబడుతున్నవి.

భారతీయ రైల్వేల యొక్క రైల్ ట్రావెల్ సర్వీసెస్ ఏజెంట్లు (RTSAs), రైల్ ట్రావెల్ ఏజెంట్‌లు (RTAs) మరియు జనసాధారణ్ టికెట్ బుకింగ్ సేవక్స్ (JTBS)తో సహ అధీకృత రైల్వే టికెటింగ్ ఏజెంట్లు అందరూ మరియు కనీసం రెండు (2) సంవత్సరాలు కొరకు పనిచేసిన/ప్రస్తుతం పని చేస్తున్న, ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (IRCTC) ద్వారా నియమించబడిన టికెటింగ్ ఏజెంట్లు కూడా YTSK పథకం క్రింద దరఖాస్తు చేసుకొనుటకు అర్హులు.

సీల్డు కవర్‌లో నిర్ణీత మరియు సంబంధిత డాక్యుమెంట్లు అన్నింటితో సహ దరఖాస్తులను '' రిజిస్టర్డ్ పోస్ట్ ఎక్నాలెడ్జ్‌మెంట్ డ్యూ'' ద్వారా పంపవలెను లేదా సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, 1వ అంతస్తు, సంచాలన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్, సికింద్రాబాద్-500025 కార్యాలయంలో స్వయంగా అందజేయవచ్చును. సీల్డు కవర్‌పై "Application for the establishment and operation of yatri ticket suvidha kendra (YTSK)" అని వ్రాయవలెను.

దరఖాస్తు దాఖలు కొరకు చివరి తేది: 03-03-2025న లేదా ఆలోగా 15.00 గంటల వరకు.

స్వయంగా లేదా తపాలా ద్వారా 03-03-2025న 15.00 గంటల తర్వాత అందిన దరఖాస్తులు స్వీకరించబడవు మరియు ఏదేని అటువంటి జాప్యానికి రైల్వే అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించదు.

దరఖాస్తులు **03-03-2025న 15.30 గంటల**కు తెరువబడతాయి.

దరఖాస్తు ఫారం, ప్రమాణాలు, అర్హత, నియమ నిబంధనలతో సహ స్కీమ్ వివరాలు దక్షిణ మధ్య రైల్వే అధికారిక వెబ్‌సైట్: **www.scr.indianrailways.gov.in**లో ఉంచబడినవి. తదుపరి వివరాల కొరకు ఏదేని పనిరోజున దిగువ సంతకందారు కార్యాలయంలో మీరు సంప్రదించవచ్చును.

A0166 సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్

డీఎస్సీలో ఖాళీలను భర్తీ చేయాలి

- పదోన్నతులు, స్పౌజ్ బదిలీలు, పదవీ విరమణలన్నీ భర్తీ చేయాలి
- పోస్టులు పెరిగేలా చేయకపోతే తీవ్రంగా నష్టపోతున్నాం
- ముక్తకంఠంతో కోరుతున్న ఎస్‌జీటీ అభ్యర్థులు

పెద్దపల్లి కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించేందుకు వచ్చిన ఎస్‌జీటీ అభ్యర్థులు (ఫైల్)

పెద్దపల్లి, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ):గత 2024 మాదిరిగా కాకుండా జిల్లాలో ఉన్న అన్ని ఖాళీలను భర్తీ చేయాలని జిల్లాలోని ఎస్‌జీటీ అభ్యర్థులు కోరుతున్నారు. గత అక్టోబర్‌లో జరిగిన 2024డీఎస్సీ ఉద్యోగాల్లో తక్కువ పోస్టులు పెట్టడంతో ఎస్‌జీటీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారు. అయితే ఇప్పుడున్న ఖాళీలే కాకుండా జిల్లాలో ఇటీవలి కాలంలో జరిగిన పదోన్నతులు, సాధారణ బదిలీలు, స్పౌజ్ బదిలీలతో ఖాళీ అయిన అన్ని పోస్టులను ఆన్‌లైన్‌లో పెట్టాలని, వచ్చే డీఎస్సీ నోటిఫికేషన్‌లో అన్ని ఖాళీలను భర్తీ చేసే విధంగా జిల్లాలోని విద్యాధికారులు చర్యలు చేపట్టాలని జిల్లాలోని ఎస్‌జీటీ అభ్యర్థులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రధానంగా గతేడాది డీఎస్సీలో పక్క జిల్లాల్లో 53మార్కులు వచ్చిన వారికి కూడా అత్యధికంగా పోస్టులు ఉండడంతో ఉద్యోగాలు లభించగా పెద్దపల్లి జిల్లాలో మాత్రం తక్కువ పోస్టులు ఉండడంతో 74.40మార్కులు సాధించినా ఉద్యోగాలు లభించలేదని ఎస్‌జీటీ అభ్యర్థులు అవేదన చెందుతున్నారు. దీంతో విద్యాశాఖ అధికారులు ఖాళీలన్నీ డీఎస్సీలో భర్తీ అయ్యే విధంగా నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ చుట్టూ, విద్యాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. సానుభూతితో జిల్లా విద్యాధికారులు ఖాళీలన్నీ భర్తీ చేసేలా ఖాళీలను ఆన్‌లైన్ చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఎస్‌జీటీ అభ్యర్థులు క్రమంగా వినతి పత్రాలను సమర్పిస్తున్నారు.

73.40మార్కులు వచ్చినా జాబ్‌రాలేదు

నేను గత 2024లో డీఎస్సీ రాశాను. నాకు 13వ ర్యాంకు వచ్చింది. 73.40మార్కులు వచ్చాయి. వేరే వేరే జిల్లాల్లో అయితే 57మార్కులు వచ్చిన వారికి కూడా ఉద్యోగాలు వచ్చా యి. జిల్లాలో తక్కువ పోస్టులు ఉండటం వల్ల తీవ్రంగా నష్టపోయినం. అసలు ఎన్ని పోస్టులు ఉన్నాయి. డీఎస్సీ ఫిబ్రవరిలో ఉంటుందని అన్నారు. మళ్లీ ఏప్రిల్‌లో ఉంటుందని అంటున్నారు. ఎప్పుడున్నా గానీ ఎన్నిపోస్టులు ఉంటాయనేది ఇప్పటికీ తెలియడం లేదు.

-హేమలత, ఎస్‌జీటీ అభ్యర్థి పెద్దపల్లి

పోస్టులు తక్కువగా ఉండటం వల్ల నష్టపోయాం..

గత 2024డీఎస్సీలో పోస్టులు తక్కువగా ఉండటం వల్ల మేం తీవ్రంగా నష్టపోయాం. వేరే జిల్లాల్లో తక్కువ మార్కులు వచ్చిన వాళ్లు కూడా ఉద్యోగాలు సాధించారు. మేం ఇక్కడ నష్టపోయాం. వచ్చే 2025డీఎస్సీలో జరగకుండా ఉండే విధంగా జిల్లా నృతాధికారులు చర్యలు చేపట్టాలి. ప్రధానంగా పదవీ విరమణ పొందిన, సాధారణ, స్పౌస్ బదిలీల ఖాళీలన్నీ ఆన్‌లైన్‌లో ఖాళీలుగా పెట్టాలి. అప్పుడే మాకు న్యాయం జరుగుతుంది.

-శిరీష, ఎస్‌జీటీ అభ్యర్థి పెద్దపల్లి

తాళం వేసిన ఇండ్లే టార్గెట్

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 6: గోదావరిఖని పట్టణంలో కొంత కాలంగా తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని గురువారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్ నిందితుడి అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. స్థానిక రమేశ్‌నగర్‌కు చెందిన ఐత వెంకటేశ్ జల్సాల కోసం దొంగతనాన్ని వృత్తిగా మలుచుకున్నాడు. రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతూ వచ్చిన సొమ్ముతో సరదాలకు డబ్బును వినియోగించేవాడు. వారం క్రితం స్థానిక మార్కండయకాలనీలో రమేశ్ తన బంధువులు చనిపోతే కుటుంబంతో కలిసి వెళ్లగా, ఇంటి తాళం పగులగొట్టి రూ.3 42లక్షల నగదు ఎత్తుకెళ్లాడు. ఆ డబ్బుతో హైదరాబాద్‌లో కారు కొనుగోలు చేసి తన స్నేహితుడికి అప్పు కింద ఇచ్చిన కారు, రెండు సెల్‌ఫోన్లు, రూ.20వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఏడు నెలల క్రితం మార్కండయకాలనీలో ఒక ఇంట్లో బంగారం, వెండి వస్తువులు, 11 నెలల క్రితం ప్రశాంత్‌నగర్‌లో నాలున్నర తులాల బంగారం, 16తులాల వెండి వస్తువులను చోరీ చేశాడు. వెంకటేశ్ గతంలో 11దొంగతనాల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి కారు, రెండు సెల్‌ఫోన్లు రూ.20వేల నగదు, 130గ్రాముల వెండిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు.

జాకబ్‌కు ఘన నివాళి

ప్రజాకవి జాకబ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 6: ప్రజా కళాకారుడు జాకబ్ 4వ వర్ధంతిని గురువారం గోదావరిఖని భాస్కరరావుభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కళాకారులు జాకబ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాకారులు దయా నర్సింగ్, జనగామ రాజనర్సులు జాకబ్‌ను స్మరిస్తూ గీతాలాపన చేశారు. ఇక్కడ సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

మహనీయుల పేర్లు పెట్టాలి

మంథని, ఫిబ్రవరి6: మంథనిలోని వీధులు, స్వాగత తోరణాలకు మహనీయుల పేర్లు పెట్టాలని మున్సిపల్ కమిషర్ మనోహర్‌రెడ్డికి గురువారం మంథని మాజీ సర్పంచ్, న్యాయవాది ఇనుముల సతీశ్ వినతిపత్రం అందజేశారు. పార్టీలకు అతీతంగా పలువురు మహనీయుల విగ్రహాలు, వారి పేర్లను పట్టణంలోని పలు వీధులు, రోడ్లకు పెట్టాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) అరుణశ్రీకి కూడా వినతి పత్రం అందించినట్లు సతీశ్ తెలిపారు.

వాగు మళ్లింపు పక్కనబెట్టి..

వంతెన నిర్మాణం

- అడ్రియాల ప్రాజెక్టుకు పొంచి ఉన్న ప్రమాదం
- సింగరేణి అధికారుల అనాలోచిత నిర్ణయం

వాగు మళ్లించకముందే చేపట్టిన వంతెన నిర్మాణ పనులు



రామగిరి, ఫిబ్రవరి 6: లాంగ్‌వాల్ ప్రాజెక్టు గనికి వెళ్లే ప్రధాన రహదారిలో గల బొక్కల వాగుకు దారి మళ్లించే ప్రక్రియలో ₹లక్షల వ్యయంతో వంతెన నిర్మాణం చేపట్టారు. దీనితో అడ్రియాల గని వాగు నుంచి వచ్చే వరద ఉధృతి ప్రమాదం ఉంటుందని కార్మికులు అభిప్రాయం వ్యక్తంచేశారు. అడ్రియాల లాంగ్‌వాల్ గనికి అడ్డంగా ఉన్న బొక్కలవాగుపై గతంలో ఐరన్ వంతెన నిర్మించారు. ఇదే వంతెనపై నుంచి వాహనాలతో కార్మికులు, అధికారులు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షకాలంలో వరదల కారణంగా వాగు ఉధృతంగా ప్రవహించడంతో వంతెన వరద నీటిలో మునిగిపోతుంటుంది. ప్రాజెక్టు చుట్టూ బొక్కలవాగు విస్తరించి ఉండటంతో నీటి ప్రవాహం వల్ల బ్రిడ్జి కూడా నీటిలో మునుగుతుంటుంది. దీనితో ఆ సమయంలో కార్మికులు విధులకు వెళ్లలేని పరిస్థితి ఉండేది. దీంతో గనిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగేది. దీంతో యాజమాన్యం ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు వాగును మళ్లింపునకు ప్రణాళికలు రూపొందించింది. ₹4.94కోట్లతో టెండర్ల ద్వారా కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. నిబంధనల ప్రకారం ముందు వాగు మళ్లింపు చేయాల్సి ఉండగా, అది చేయకుండా వంతెన నిర్మాణం చేపట్టారు. ముందుగా నిర్మించిన వంతెన వద్ద వరద నిలిచిపోయే అవకాశం ఉంటుందని కార్మికులు ఆరోపణలు చేస్తున్నారు.

ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ముత్తారం, ఫిబ్రవరి 6: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా మిర్చి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేశామని డీఆర్డీవో కళిందిని పేర్కొన్నారు. నాబార్డ్ ఫార్మ్ సెక్టార్ ప్రమోషన్ ఫండ్ కింద మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న మిర్చి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పనులను గురువారం ఆమె పరిశీలించి, మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులతో మిర్చి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తూ, ఉత్పత్తులు చేసి వాటిని మార్కెటింగ్ చేస్తూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు పనులు చేపట్టామన్నారు. ఈ అవకాశాన్ని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొవాలని సూచించారు. ఇక్కడ ఏపీఎం పద్మ, తిరుపతి, ప్రకాశ్, మిర్చి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్వాహకులు, తదితరులు ఉన్నారు.

కావటి సతీశ్‌కు డాక్టరేట్

మంథని రూరల్, ఫిబ్రవరి 6: కన్నాలలో నిరుపేద ఒగ్గు కళాకారుల కుటుంబానికి చెందిన స్వర్గీయ కావటి మల్లయ్య రాజమ్మ దంపతుల కుమారుడు కావటి సతీశ్‌కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్య కిషన్‌రావు పర్యవేక్షణలో ఒగ్గు మందెచ్చు కళారూపాల సాహిత్యం సమ పరిశీలన అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నాడు. తన చదువుకు సహకరించిన తల్లిదండ్రులు, అక్కాబావలు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు కిషన్‌రావు, కమలాకర్ శర్మ, ఖాసీం, సూర్య ధనుంజయ్, రఘు, విజయలక్ష్మి, వైస్ ఛాన్స్‌లర్ నిత్యానందరావుకు సతీశ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టరేట్ పొందిన కావటి సతీశ్‌తో స్థానికులు, బంధువులు